క్లుప్తంగా

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: మండలంలో హంసవరంలో ఉన్న ఆదర్శ విద్యాలయం (ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల)లో 2024–25 సంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ మొదట సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాలయంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా బోధించనున్నట్టు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 22 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. అనంతరం విద్యార్థికి కేటాయించిన జనరల్ నంబర్ ఆధారంగా ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ లేదా సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



తునిలో బాధితులకు సెల్ ఫోన్ అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

తుని: రైలులో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితుడికి అప్పగించామని తుని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. దువ్వాడకు చెందిన గుడాల సతీష్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం లోవలోని తలుపులమ్మ దర్శనానికి రైలులో వచ్చి తుని స్టేషన్‌లో దిగారు. జేబులో ఉన్న వివోవై 100 ఫోన్ కనిపించక పోవడంతో జీఆర్పీ పోలీసులకు సతీష్ ఫిర్యాదు చేశాడు. జీఆర్పీ ఎస్సై అబ్దుల్ మారూఫ్ సాంకేతిక పరిజ్ఞానంతో సమీప స్టాండ్‌లో ఫోన్ ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రూ.28 వేలు విలువ చేసే ఫోన్‌ను బాధితుడి సతీష్‌కు అప్పగించారు. హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రామకోటి పాల్గొన్నారు.


మహిళలకు మగ్గం వర్కుపై శిక్షణ



కాండ్రేగులలో శిక్షణ పొందుతున్న మహిళలు

జగ్గంపేట: మండలంలోని కాండ్రేగుల గ్రామంలో మగ్గం వర్కులో నైపుణ్యం పెంచుకునేందుకు 60 మంది మహిళలకు శనివారం ఉచిత శిక్షణ ఇచ్చారు. డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి పర్యవేక్షణలో ట్రైనీ అల్లంపల్లి రూపశ్రీ మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సుంకర్ ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఏలేశ్వరం, యర్రవరం ప్రాంతాల్లో మహిళలకు ఇదేవిధంగా ఉచిత శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మహిళా సాధికారిత, వారి ఆర్థిక సంక్షేమమే తమ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉత్తరకంచి, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భక్తులకు అన్నదానం చేశారు.

122 మంది గైర్హాజరు

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం ఫిజికల్ సైన్సు పరీక్షకు 122 మంది గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని 9 పరీక్షా కేంద్రాల్లోను 1617 మంది విద్యార్థులు, 384 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 122 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక



రాజపూడిలో పార్టీలో చేరిన వారితో జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సూచించారు. మండలంలోని కాట్రావులపల్లి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు సుమారు 50 మంది శనివారం తోట నరసింహం సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. జగ్గంపేట మండలం రాజపూడిలోని రాజభవన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాట్రావులపల్లి సర్పంచ్ పిట్టా సుగుణరావు, ఎంపీటీసీ సభ్యుడు మలిరెడ్డి సత్తిబాబు, సూరిమిల్లి దొరబాబు, కొండేపూడి శ్రీను ఆధ్వర్యంలో 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ నాగబాబు, నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త అత్తులూరి సాయిబాబు, మండల జెసీఎస్ కన్వీనర్ పెద్దాడ రాజబాబు, వైఎస్సార్ సీపీ నేతలు జగాల్, కాపారపు ప్రసాద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పాస్టర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ ఆధ్వర్యంలో శనివారం పాస్టర్ల ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పాస్టర్లు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, పెద్దాడ రాజబాబు పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి



పాదురుపాకలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- పొదురుపాక, పాండవులపాలెం గ్రామాల్లో గడపగడపకూ ...

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ఎన్నికల్లో ప్రజలు సంక్షేమానికి పట్టం కట్టాలని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని పాదురుపాకం, పాండవులపాలెం గ్రామాల్లో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి, అవినీతికి ఆస్కారం లేకుండా పరిపాలన అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, సర్పంచ్ ఏపూరి రామారావు, పార్టీ నాయకులు తుట్టా జమిందార్, అన్నిక సత్తిబాబు, మామిడి నరసింహమూర్తి, ఒమ్మి రమణ, ఒట్టికోళ్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



కొంతంగిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సుబ్బారావు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

శంఖవరం: మండలంలోని కొంతంగి గ్రామానికి చెందిన పలు కుటుంబాలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన దూడల శివ, గింజల కొండబాబు ఆధ్వర్యంలో పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ చేరారు. వీరికి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం

- జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

గండేపల్లి: వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతులో మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని కె.గోపాలపురంలో ఆయన సతీమణి వాణి, కోడలు శ్రీనిధితో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం పార్టీ నాయకులు, గ్రామస్తులు తోట నరసింహం, ఆయన సతీమణి వాణిలను పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, పార్టీ నేతలు కుంచే చినబాబు, పరిమి వెంకటేశ్వరరావు, అవసరాల పార్థసారథి, గ్రామ సర్పంచ్ కర్రి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కె.గోపాలపురంలో తోట నరసింహం దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

గోకవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే ప్రజల మద్దతు ఉంటుందని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని పెంటపల్లిలో శనివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఎటువంటి అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే పథకాలు అందాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల అమ్యూల్యమైన ఓటుని ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

100 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు



సారాతో వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎస్ఈబీ అధికారులు

ప్రత్తిపాడు రూరల్: వంద లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ఏలేశ్వరం మండలం యర్రవరంలో శనివారం పోలీసులు గస్తీ నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన సొంటెపు శ్రీను మోటార్ సైకిల్‌పై 100 లీటర్ల సారా రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై ఎం.ఆశాలత, హెడ్ కానిస్టేబుల్స్ వెంకన్న దొర, కృష్ణార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల పేర్లతో బెదిరింపులు

గండేపల్లి: పేదల అవసరాన్ని ఆసరాగా తీసుకుని అధికారుల పేర్లు చెప్పి సొమ్ములు వసూళ్లు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని సూరంపాలెం పంచాయతీ పరిధిలోని రామేశంపేటలో సర్వే నంబర్ 221బై1లో సుమారు 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది. వీటిలో ఆ పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. కాగా కొంతమంది ఇళ్లు నివాసయోగ్యంగా లేకపోవడంతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. వీరికి పంచాయతీ అనుమతి, విద్యుత్ కనెక్షన్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామంటూ కొంతమంది పెద్దలు పంచాయతీ, రెవెన్యూ అధికారుల పేర్లు చెప్పి బెదిరించి తమ నుంచి సొమ్ములు వసూలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇల్లు నిర్మించుకోవాలంటే సొమ్ములు కట్టాల్సిందేనని భయపెట్టడంతో బాధితులు గరగ జ్యోతి రూ.70 వేలు, అడపా చక్రలక్ష్మి రూ.70 వేలు, వీవీవీ సాయికుమార్ రూ.1.40 లక్షలు, యల్లమిల్లి శ్రీను రూ.70 వేలు, జువ్వల ప్రభావతి రూ.50 వేలు, అడ్డాల వెంకటేశ్వరరావు రూ. 1 లక్ష చెల్లించారు. కాగా ఇదే తరహాలో ఇటీవల కాలంలో మరికొంత మందిని బెదిరిస్తున్నట్టు సమాచారం. దీనిపై బాధితులు ఇప్పటికే పెద్దాపురం ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అమాయక ప్రజలను బెదిరించి మోసాలకు పాల్పడుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సూరంపాలెం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచె చినబాబు డిమాండ్ చేశారు.

విప్లవ యోధులకు ఘన నివాళులు



జగ్గంపేటలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మహిళలు, నాయకులు



ఏలేశ్వరంలో అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు



ప్రత్తిపాడులో భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఐలాజ్ ప్రతినిధులు

ఏలేశ్వరం: భారత విప్లవయోధులు భగత్‌సింగ్,రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన భగత్‌సింగ్‌తో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరి తీయడం బాధాకరమన్నారు. భారతదేశ ముద్దుబిడ్డ భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చిన్న వయస్సులో అశువులు బాసిన భగత్‌సింగ్ దేశప్రజలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా బ్రిటీషు వారిని ఎదిరించిన భగత్‌సింగ్‌కు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగత్ సింగ్ పోరాటం మరువలేనిది

ప్రత్తిపాడు రూరల్: బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ రాజీలేని పోరాటం చేశారని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) కేంద్ర కమిటీ సభ్యుడు బుగత శివ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏనుగుపాటి అర్జునరావు అన్నారు. ప్రత్తిపాడులో ఐలాజ్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో వేర్వేరుగా శనివారం భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగాన్ని కొనియాడారు. భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విప్లవ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వాడబోయిన శివ, విప్లవ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జనార్దన్, లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కాకర రత్నకుమారి, ఐలాజ్ నాయకులు నక్కా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి

జగ్గంపేట: విప్లవ వీరుడు భగత్‌సింగ్ వర్ధంతిని జగ్గంపేటలో శనివారం నిర్వహించారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు మరుకుర్తి ఏసు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు జి.బాలరాజు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమంలో ఆయన పోరాట ప్రతిమను కొనియాడారు. రంగవల్లి నగర్‌లో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే ప్రజల మద్దతు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- సిరిపురంలో ఎన్నికల ప్రచారం



సిరిపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: రాష్ట్రంలో ప్రజల మద్దతు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌కు మళ్లీ అధికారం ఇవ్వాలని కోరారు. తొలుత గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతల నూకరాజు, పార్టీ నేతలు మజ్జూరి సూర్యనారాయణ, ఆల్లం ఆదినారాయణ, సాదే లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి

- మంత్రి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- జగన్నాథపురంలో ఎన్నికల ప్రచారం



జగన్నాథపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న శంకర్‌మల్లిక్

కోటనందూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ప్రజలు అండగా నిలవాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని జగన్నాథపురంలో శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. అవ్వాతాతలు, మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మరింత మంచి జరుగుతుందన్నారు. తుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తన తండ్రి దాడిశెట్టి రాజాను వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సర్పంచ్ లెక్కల ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- పెంటపల్లిలో ఎన్నికల ప్రచారం



గోకవరం మండలం పెంటపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తోట రాంజీ

గోకవరం: వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని పెంటపల్లిలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను అమలు చేశారన్నారు. ఈ సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు గుప్పిస్తున్న ప్రతిపక్షాల మాటలను నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తోట నరసింహాన్ని ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఉప సర్పంచ్ దాకారపు ధర్మరాజు, కర్రి శివరామకృష్ణ, పాటి తాతీలు, సర్పంచులు బత్తుల శ్రీను, కమ్మెల అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదస్యం



తాళ్లూరులో విద్యుత్ కాంతుల నడుమ స్వామివారి గాలిగోపురం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సదస్యం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శనివారం కావడంతో స్వామివారి తిరునాళ్లకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. ఆలయానికి విద్యుత్ కాంతులు ఏర్పాటు చేయడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు.



ధర్మవరం రాజగోపాలస్వామి ఆలయంలో ఏకాహం నిర్వహిస్తున్న భజన కళాకారులు

రాజగోపాలస్వామి ఆలయంలో సదస్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వేంచేసిన రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాల స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సదస్యం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో స్థానిక భజన కళాకారులు ఏకాహం నిర్వహించారు.

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు



పోతులూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర రక్షణ బలగాలు, పోలీసులు

ప్రత్తిపాడు రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు కోరారు. మండలంలోని పోతులూరు, వాకపల్లి, వెంకటనగరం, తోటపల్లి గ్రామాల్లో శనివారం కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రత్తిపాడు ఎస్సై పి.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ప్రజల్లో ధైర్యం నింపేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించినట్టు తెలిపారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు జల్లులతో చల్లబడిన వాతావరణం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. వేసవి తాపంలో అల్లాడిన ప్రజలు వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. మరికొద్ది రోజుల పాటు ఈ విధమైన వాతావరణం ఉంటుందని భారత వాతావరణశాఖ ప్రకటించింది.